ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

బుధవారం 7 ఫిబ్రవరి 2024



మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్

7లో..



పారిశుధ్యం మెరుగు పడేనా?

- నేటి నుంచి 15 వరకు పల్లెల్లో శానిటేషన్ డ్రైవ్
- నీటి ఎద్దడి నివారణకు చర్యలు
- సమస్యల గుర్తింపు... ప్రత్యేక చర్యలు
- 15వ ఆర్థిక సంఘం నిధులతోనే కార్యక్రమాలు
- అందని రాష్ట్ర అర్థిక సంఘం నిధులు
- ప్రత్యేక అధికారులకు తొలి సవాల్...
- జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లెల సమస్యల గుర్తింపు, పారిశుధ్య నిర్వాహణపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 2వ తేదితో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసిపోయి ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ మొదలైంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెల్లో తొలి కార్యక్రమంగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ప్రకటించింది. ఈ నెల 7 నుంచి 15వ తేది వరకు పారిశుధ్య పనులు, నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో వెయ్యి లోపు జనాభా ఉన్న గ్రామపంచాయతీలు వంద గ్రామాలు ఉండగా, ఐదువేల వరకు 148 గ్రామాలు, అపైనా ఏడు గ్రామాలు ఉన్నాయి. పంచాయతీల పాలకవర్గం ముగియడంతో ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, పశు వైద్యాధికారులు, ఉద్యానవనలతో పాటు వివిధ శాఖల అధికారులను పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమించారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలకు 139 మంది అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం తొలిసారిగా ఇచ్చిన ప్రత్యేక కార్యక్రమం శానిటేషన్ డ్రైవ్‌ను ప్రత్యేక అధికారులకు సవాల్‌గానే మారింది. జిల్లాలోని గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహించారు. గ్రామాల్లో ఎనిమిది రోజుల పాటు పారిశుధ్య, తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కల తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. ప్రమాదకరంగా, పాడుబడిన బావులను పూడ్చివేయనున్నారు. గ్రామాల్లో ప్రధానంగా శానిటేషన్ పనులకు సిబ్బంది కొరత కూడా ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఉన్నాయి.

● నీటి సమస్యల నివారణపై దృష్టి

శానిటేషన్ డ్రైవ్‌తో పాటు వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు కూడా చేపట్టనున్నారు. జిల్లాలో మిషన్‌భగీరథకు సంబంధించి రూ 1,131కోట్లతో పనులు చేపట్టారు. జిల్లాలో 359 ఆవాసాలు ఉండగా 357 ఆవాసాలకు నీటి సరఫరా చేస్తున్నట్లుగా మిషన్ భగీరథ అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలో 625 ట్యాంక్‌లు ఉన్నాయి. ఇందులో కొత్త ట్యాంకులు 227 ఏర్పాటు చేయగా పాత ట్యాంక్‌లు 358 ఉన్నాయి. వీటి పరిధిలో 1,04,529 కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలకు కూడా మిషన్‌భగీరథ నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్‌లో నీటి సరఫరా సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి కనెక్షన్లు లేనివారికి ఇవ్వడంతో పైపులైన్‌ల లీకేజీలు, ట్యాంక్‌లు, ఓపెన్‌బావుల క్లోరినేషన్, వంటివి కూడా చేపట్టనున్నారు.

● నిధులే ప్రధాన సమస్య..

ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి నివారణకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినా నిధుల కొరత సమస్యగా మారనుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో కూడా రాష్ట్ర వాటా అందడం లేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేస్తూ వస్తోంది. ఇటీవలే రూ 7.20 కోట్ల వరకు నిధులను అందించింది. వాటిని ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్‌లో ఉపయోగించుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు రావాల్సిన పాత బకాయిలు కూడా విడుదల చేయలేదు. చివరకు ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు అందించాల్సిన ప్రోత్సాహం కూడా రాలేదు. జిల్లాలో 41 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. గతంలో ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ఏడు లక్షలు అందజేస్తే దానికి తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రభుత్వం రూ 10 లక్షలకు పెంచింది. నిధులు మాత్రం విడుదల చేయలేదు. జిల్లాలో ప్రోత్సాహక నిధులు రూ 4.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పాటు ప్రతీ సంవత్సరం రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందించకపోవడంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటున్నాయి. కార్యదర్శులు ఆర్థిక సంవత్సరం ముగిసే దశకు వస్తున్న క్రమంలో ఆస్థిపన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

పకడ్బందీగా స్పెషల్ డ్రైవ్ నిర్వాహణకు ఏర్పాట్లు

- ఎ రవీందర్ జిల్లా పంచాయతీ అధికారి



జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎ రవీందర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కార్యక్రమాలను నిర్వహించి గ్రామపంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తాం.

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇలా..

- గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీల కార్యదర్శుల అధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలి. రోడ్లను శుభ్రం చేయించాలి.
- మురికి నీటి కాలువల్లో పూడిక తీయించడం, మురికి నీరు సాఫీగా వెళ్లే విధంగా చూడడం, వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా చూడాలి.
- గుంతలు పడ్డ రోడ్లను మట్టి, లేదా మొరంతో పూడ్చివేయాలి.
- పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చెరువులు, కుంటల్లోకి వెళ్లే విధంగా కాలువలు తవ్వించాలి. పల్లపు ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి.
- పల్లపు ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వించాలి. వర్షపునీరు గ్రామాల్లోనే ఇంకిపోయి గ్రామ పరిసరాల్లోని బోర్లను రీచార్జ్ చేస్తాయి.
- దోమలు నిల్వ ఉండకుండా కుంటలు, పెద్ద పెద్ద గుంతల్లో ఆయిల్ బాల్స్, రసాయనాలు చల్లించాలి.
- దోమల సంతతి పెరగకుండా డెంగ్యూ వ్యాధి కలిగించే దోమల ఉత్పత్తి జరగకుండా చర్యలు చేపట్టాలి.
- ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలి. పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగి డ్రై డే వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలి. ఇళ్లలో తొట్లు, కుండలు, ప్లాస్టిక్ బాటిళ్ల కొబ్బరి బోండాలు, పాత టైర్లు వంటి వాటిలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- తాగునీరు అందించే ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయాలి, నీటి సరఫరాల పైపులైన్ల లీకేజీలను అరికట్టాలి.
- తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి. నల్ల గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి. ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లను ప్రజలు ఎవరూ ధ్వంసం చేయకుండా చూడాలి.
- ప్రతీ రోజు ప్రతీ ఇంటి నుంచి తప్పనిసరిగా తడిచెత్త, పొడిచెత్తగా విభజించే విధంగా చూడాలి.
- ప్రతీ రోజు తడిచెత్త, పొడిచెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి.
- తడిచెత్తను తప్పనిసరిగా కంపోస్ట్ విధానంతో ఎరువుగా మార్చాలి
- గ్రామపంచాయతీ పరిధిలో పిచ్చిమొక్కలు, పిచ్చిచెట్లు, పొదలు పెరగకుండా చర్యలు చేపట్టాలి.
- వారంలో రెండు రోజులు నీటితో కలిపిన రసాయనాన్ని బస్టాండ్‌లు, మార్కెట్‌లు, పాఠశాల ఆవరణల్లో పిచికారి చేయాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు అర్హులను గుర్తించాలి. ఒక గుంత ఉన్న మరుగుదొడ్లను రెండు గుంతలుగా మార్చాలి. సెప్టిక్ ట్యాంక్ ఉన్న మరుగుదొడ్లకు ఇంకుడుగుంతలు నిర్మించడం, గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడుగుంత నిర్మాణం, కిచెన్ గార్డెన్, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం
- శిథిలాలు చెత్త కుప్పలు తొలగించడం, ప్రభుత్వ సంస్థలు కమ్యూనిటీ ప్రదేశాలు శుభ్రం చేయడం,
- శ్రమదానంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళ సంఘాల సభ్యులతో నిర్వహించాలి.
- చివరి రోజు ముగింపు సమావేశంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలి. పారిశుధ్య సిబ్బందిని, పారిశుధ్యాన్ని పాటిస్తున్న ఇళ్ల యజమానులను సముచితంగా గౌరవించాలి.

మానేరు లోకి మల్లన్నసాగర్ నీళ్లు



మానేరులోకి చేరిన గోదావరి జలాలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి మల్లన్నసాగర్ నుంచి గోదారి జలాలు మంగళవారం సాయంత్రం చేరుకున్నాయి. మల్లన్నసాగర్ నుంచి కూడవెల్లి వాగు ద్వారా గోదారి జలాలు మానేరులోకి పరుగులు తీశాయి. సోమవారం మల్లన్నసాగర్ నీటిని అధికారులు మానేరులోకి విడుదల చేశారు. గోదారి జలాలు కూడవెల్లి చెక్ డ్యాంలను పూర్తిగా నింపుతూ మంగళవారం సాయంత్రం కల్లా మానేరులోకి చేరుకున్నాయి. మానేరు నీటి సామర్థ్యం 31 అడుగులు ఉండగా, ప్రస్తుతం 22 అడుగుల వరకు ఉన్నాయి. యాసంగిలో మానేరు ఆయకట్టు పరిధిలో సాగు చేసిన వరి పంటలు ఎండిపోకుండా ఉండేందుకు మానేరులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేశారు.

కరెంట్ మీటర్ల వివరాలను సేకరించాలి

- ఎన్‌పీడీసీఎల్ సీజీఎం శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ సూర్యచంద్రరావు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ పరిధిలో కరెంట్ మీటర్ల వివరాలను సిబ్బంది సమగ్రంగా సమర్థవంతంగా సేకరించాలని ఎన్‌పీడీసీఎల్ సీజీఎం శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ సూర్యచంద్రరావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సెస్ పరిధిలోని సిబ్బందితో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 200 యూనిట్లలోపు కరెంట్ బిల్లును మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతీ ఇంటికి సిబ్బంది వెళ్లి కరెంట్ మీటర్లను పరిశీలించి ఇంటి యాజమానికి సంబంధించిన కరెంట్ బిల్లుతోపాటు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లను తీసుకోవాలని వాటిని ప్రభుత్వం సూచించిన విధంగా అన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటిలో ఎన్ని మీటర్లు ఉనా ఇంటి యజమాని పేరుతో ఉన్న ఒక్క కరెంట్ మీటర్లకు మాత్రమే గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కరెంట్ మీటర్ల వివరాలను తీసుకునేందుకు వచ్చిన సెస్ సిబ్బందికి సహకరించడంతోపాటు వారి కరెంట్ మీటర్ల వద్ద ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నంబర్లతోపాటు సెల్ ఫోన్ నంబర్లను రాసి అతికించాలని సూచించారు. సమావేశంలో సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రమాదేవి, సుధాకర్, వరుస కృష్ణహరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి నిధులు మంజూరు చేయండి

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6: మండలంలోని వంతడుపుల గ్రామానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని శంభులింగేశ్వర ఆలయం పునరుద్ధరణకు ఇప్పటికే రూ 15లక్షలు ఖర్చుచేశామని తెలిపారు. ఆలయ ప్రతిహారీ నిర్మాణానికి ఎంపీ నిధుల ద్వారా రూ. ఆరు లక్షలు కేటాయించాలని విన్నవించారు. ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సామ బాల్‌రెడ్డి, ముక్కీస స్వామిరెడ్డి, సామ ఎల్లారెడ్డి, చింతలపల్లి రాజిరెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, కాట్నపెల్లి రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 6: తెలంగాణలోని గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం పక్కా భవనా లు నిర్మించాలని టీఎస్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మోతె రాజిరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని గురుకుల పాఠశాలను రాజిరెడ్డి, జిల్లా నాయకుడు శ్యాగ ప్రశాంత్ సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలతో విద్యార్థులు అసౌకర్యాలతో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గురుకులాల పాఠశాలలకు పక్కా భవనాలను నిర్మించాలని, పేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: ఎస్‌కేఎం, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన చేపట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో గ్రామీణ బంద్, సమ్మె కరపత్రాన్ని అవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ బంద్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర చట్టం చేయాలనే తదితర డిమాండ్లతో గ్రామీణ బంద్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు, సీపీఐ నాయకులు బాచుపల్లి శంకర్, అంజిరెడ్డి, రాజేందర్, మల్లయ్య, బాలమల్లు, అనంద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 6: ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి అన్నారు. వట్టెంల గ్రామంలో మంగళవారం నిర్వహించిన గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి నందగిరి రాహుల్, బూత్ అధ్యక్షులు మ్యాకల శ్రీనివాస్, సింగరవేని హరీష్, చంద్రశేఖర్, బసరవేని ప్రసాద్, రంగు వంశి, గట్టు మనిదీప్, బబ్లూ పాల్గొన్నారు.

కూలిన ఇల్లు

కోనరావుపేట, ఫిబ్రవరి 6: కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన లక్ష్మీ రాములు దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరుకుంది. దంపతులు కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోవడంతో అందులోనే ఓ మూలన ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లిన లక్ష్మీ ఇంట్లోకి వచ్చేసరికి కూలిపోయి ఉంది. పేదరికంలో ఉన్న దంపతుల కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చీరల సేకరణ హక్కుల ద్వారా కోటిన్నర ఆదాయం

- రెండోసారి టెండర్‌తో అదనంగా 50 లక్షల రాబడి

వేములవాడ, ఫిబ్రవరి 6 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించే చీరలు, దోవతులు, శెల్లాల సేకరించి హక్కుల కోసం నిర్వహించిన టెండర్ ద్వారా ఆలయ ఖజానాకు కోటిన్నర రూపాయలకు పైగా ఆదాయం సమకూరనుంది. మార్చి 10వ తేదీ నుంచి 2026 మార్చి 9వ తేదీ వరకు రెండు సంవత్సరాల కాలంలో భక్తులు రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో సమర్పించే చీరలు, దోవతులు, చెల్లాల సేకరణ హక్కుల కోసం ఆలయ ఏఈవో సంకేపల్లి హరికిషన్, లీజెస్ విభాగం సూపరింటెండెంట్ గోలి శ్రీనివాస్ నేతృత్వంలో మంగళవారం టెండరుకం బహిరంగ వేలం పద్ధతిన వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నిర్వహించిన బహిరంగ వేలంలో ముగ్గురు కాంట్రాక్టర్లు పాల్గొనగా ఒక కోటి ఒక లక్ష 200 రూపాయలతో స్వామివారి పాట ప్రారంభించగా సగ్గు శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ అత్యధికంగా కోటి 20 లక్షల వరకు పాడారు. అనంతరం అధికారులు సీల్డ్ టెండర్లు పరిశీలించగా సీల్డ్ టెండరు వి పర్శరాములు 1,16,00,666లు, శివరాత్రి సిద్దార్థ, రూ. 1,26,00,116, చొప్పదండి నికిల్ కుమార్ రూ. 1,51,15,516 పేరిట టెండర్లు దాఖలయ్యాయి. ఆన్‌లైన్ టెండర్లలో పరిశీలించగా, శ్రీనివాస ట్రేడర్స్ పేరిట రూ. 1,35,82,290 బిడ్ దాఖలయింది. వీటిలో అత్యధికంగా కోటి 51 లక్షల 15 వేల 516 రూపాయలకు కోట్ చేసిన సిరిసిల్లకు చెందిన చొప్పదండి నికిల్ కుమార్‌కు ఆలయ అధికారులు టెండర్ ఖరారు చేశారు. గతంలో 78 లక్షల రూపాయలు ఉన్న ఈ టెండర్ ఈసారి దాదాపు రెండింతలు పెరిగి ఒక కోటి 51 లక్షలకు చేరుకున్నదని ఆలయ అధికారులు తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

● బెడిసి కొట్టిన కాంట్రాక్టర్ల వ్యూహం..

ఇదిలా ఉండగా జనవరి 12వ తేదీన నిర్వహించిన టెండర్‌లో కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఒక కోటి ఒక లక్ష రూపాయలకు టెండర్ దక్కించుకునేందుకు శతవిధాల ప్రయత్నించారు. ఆనాటి టెండర్ను రద్దుచేసి తిరిగి తాజాగా టెండర్ నిర్వహించడంతో టెండర్ మొత్తం కోటి 51 లక్షలకు పెరిగి ఆలయ ఖజానాకు అదనంగా 50 లక్షల రూపాయల ఆదాయం సమకూరినట్లు అయింది.

ఆసుపత్రి భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

చందుర్తి, జనవరి 6: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని జడ్పీ సీఈవో గౌతంరెడ్డి మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వేగవంతంగా పనులు జరిగేలా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రవీందర్, వైద్యాధికారి సంపత్ ఉన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6: విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని ఎస్ఆర్ఆర్ విశ్రాంత ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకుండా ఆత్మస్థైర్యంతో చదవాలని అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం: ఎస్పీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: నిరంతరం విధులు నిర్వహించే హోం గార్డ్స్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ ప్రథమ ప్రాధాన్యం అని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. హోం గార్డ్స్ సిబ్బంది, వారి కుటుంబసభ్యుల యొక్క ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సిరిసిల్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌సౌజన్యంతో తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామశివారులోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న 198 హోం గార్డ్స్ సిబ్బందికి వారి కుటుంబసభ్యుల ఆరోగ్యమే మా ప్రథమ ప్రాధాన్యం అన్నారు. ఇప్పటికే జిల్లాలో పని చేస్తున్న హోంగార్డ్స్‌కు ఆరోగ్య కార్డులను అందజేసినట్లు తెలిపారు. పోలీసులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, వైద్యుల సలహాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హోంగార్డ్స్, సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గూడూరు రవీంద్ర, వివిధ విభాగా లకు చెందిన వైద్యులు కోడం విక్రమ్, రాజేంద్ర, యాదగిరి గౌడ్, మోహనకృష్ణ, శ్రీకాంత్, లీలా శిరీష, గీతా, వాణి, మంజూష, వంశీ, శివరామ కృష్ణ, సాయి, శ్రావణ్, అభినవ్, స్వామి, ఆర్‌ఐలు రమేష్, యాదగిరి, మాధుకర్, సిబ్బంది, హోం గార్డ్స్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఇద్దరు దొంగల అరెస్టు

● 135 గ్రాముల బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, జనవరి 6: జల్సాలకు అలవాటుపడి సులవుగా డబ్బులు సంపాదించాలనే ఇద్దరు దొంగల ముఠాను మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందవర్భంగా ఏసీపీ ఎడ్ల మహేష్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కుకుతుబుల్లాపూర్, భగత్ నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్, భూపాల్‌పల్లి జిల్లా మొట్లపల్లికి చెందిన మిర్యారి రాజులు గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితంలో పరిచమయ్యారు. వీరిద్దరూ జనవరి 31న పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తమ వెంట తెచ్చుకున్న రించ్ స్పానర్‌తో ఓ ఇంటి తాళం పగులగొట్టి చొరబడగా ఆ ఇంటిలో ఖరీదైన వస్తువులు దొరకపోవడంతో పక్కనే ఉన్న ఎరవెల్లి వెణుగోపాల్‌రావు ఇంటి తాళం పగుల గొట్టి బంగారు, వెండి అభరణాలు దొరికినకాడికి దోచుకొని పారిపోయారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆచూకీ సేకరించారు. మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టారు. చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్న దొంగల నుంచి 135 గ్రాముల బంగారం, లక్షా 40 వేల రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్, బంగారు అభరణాల లోన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ఆర్ కృష్ణ, పెద్దపల్లి, ధార్మరం, బసంత్ నగర్ ఎస్సైలు మల్లేష్, సత్యనారాయణ, వెంకటేష్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

నాలుగు ఇళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: తంగళ్లపల్లి మండలంలో నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం..గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి రూ. 1.50 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం, కిలో వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని తంగళ్లపల్లికి చెందిన కడమంచి లింగమూర్తి ఇంటి తాళం పగులగొట్టి 40 వేల నగదు, నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే మ్యాకల గంగారాం ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 60వేల నగదును దోచుకున్నారు. పక్కనే ఉన్నా మ్యాకల నర్సయ్య ఇంటి తాళాన్ని పగులగొట్టి వస్తువులను చిందర వందరగా చేశారు. అలాగే పద్మనగర్‌కు చెందిన పురోహితుడు పారునంది అంజనేయ శర్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఊరువెళ్లగా తాళాలు పగులగొట్టిన దొంగలు రూ 50 వేల నగదు, తులం బంగారంతో పాటు కిలో వెండి అభరణాలను అపహరించినట్లు తెలిపారు. 48 గంటల్లో ఓబులాపూర్ గ్రామంతో పాటు తంగళ్లపల్లి, పద్మనగర్‌లలో ఏడు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల అచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ ప్రశాంత్‌లు పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గంగాధర, ఫిబ్రవరి 6: మాయమాటలు చెప్పి ప్రయాణికురాలి రెండు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించిన నిందితులను పట్టుకున్నట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు లక్ష్మి(60) గంగాధర మండలం గర్శకుర్తిలోని కూతురు ఇంటికి కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ రోడ్డు వద్ద ఆటో ఎక్కి వస్తుండగా ఆటో డ్రైవర్ రాజు, అతని భార్య పద్మావతి మాయమాటలతో పుస్తెలతాడు దొంగిలించినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 48 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గంగాధర ఎస్ఐ అభిలాష్, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆటో కిందపడి చిన్నారి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: కొత్తపల్లి మండలం చింతకుంటలో మంగళవారం ఉదయం ఒక ఆటో కిందపడి 16 నెలల చిన్నారి మృతి చెందిందని కొత్తపల్లి ఏఎస్ఐ మొగిలి పోచయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన వేముల నూతనశ్రీ అనే చిన్నారిపై నుంచి ఆటో టైర్ ఎక్కటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఇంటర్‌నెట్ కేబుల్ లైన్ తవ్వేందుకు వచ్చిన కూలీలు చింతకుంటలో పనిచేస్తున్నారు. నీటిని సరఫరా చేస్తున్న అంజయ్యకు తన ఆటోను రివర్స్ తీస్తుండగా అక్కడే నూతనశ్రీ తన తల్లితో కలిసి ఉంది. ప్రమాదవశాత్తుగా ఆటోను చిన్నారిపై నుంచి తీయటంతో దుర్మరణం చెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదుతో చింతకుంటకు చెందిన ఆటో డ్రైవర్ అంజయ్యపై ఫిర్యాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మొగిలి పోచయ్య తెలిపారు.

మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 6: మహాశివరాత్రి జాతర కోసం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని దిశానిర్దేశం చేశారు. శివ స్వాములకు సులభ దర్శనం జరిగే విధంగా చూడాలని, దర్శన సమయం కూడా అరగంట అదనంగా పెంచాలన్నారు. పుర ప్రముఖులకు గతంలో మాదిరి బ్యాడ్జీలు అందజేసి సులభ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం భక్తుల కోసం రెండు క్యూలైన్‌ల సిస్టం ఉన్న దృష్ట్యా వీఐపీల కోసం మూడో క్యూలైన్ శివరాత్రి లోగా ఏర్పాటు చేయాలని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు తాగునీరు, కుర్చీలు, పందిల్ల సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పారిశుధ్య సిబ్బందిని నియమించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు శాశ్వత సీసీ కెమెరాలను పెట్టాలన్నారు. జాతర విజయవంతం చేయాలని కోరారు.



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ ఆదిశ్రీనివాస్

అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జాతర సమన్వయ కమిటీ చైర్మన్ అనురాగ్ జయంతి సూచించారు. భక్తులు స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు.

జాతరకు భారీ బందోబస్తు : ఎస్పీ అఖిల్ మహాజన్

మహా శివరాత్రి జాతర సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, టోయింగ్ వాహనం, క్రేన్ అందుబాటులో ఉంచాలని ఆలయ ఈవోకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వలంటీర్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

వీఐపీ క్యూలైన్ కోసం ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో వీఐపీ క్యూలైన్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో మూడో క్యూలైన్ ఉపయోగించడం వల్ల సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా లభించే అవకాశం ఉందని, ఇదే క్యూలైన్‌ను వీఐపీల బ్రేక్ దర్శనం కోసం నిర్దీత సమయాల్లో ఉపయోగించవచ్చని ఆది శ్రీనివాస్ సూచించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులకు వారు సూచించారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టుకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నవేని(బండల్ల) అజయ్(18)అనే యువకుడు మంగళవారం తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొందరు గమనించి 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అజయ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాజన్న క్షేత్రంలో తిరుమల తరహా వీఐపీ బ్రేక్

● ఉదయం, సాయంత్రం గంట చొప్పున దర్శనం

వేములవాడ, ఫిబ్రవరి 6: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమలు చేస్తున్న తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులకు దర్శనం నిలిపివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి టీటీడీ తరహాలో వీఐపీ బ్రేక్ దర్శన విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. ఉదయం వేళలో ఒక గంట, సాయంత్రం వేళలో ఒక గంట సమయం వీఐపీ బ్రేక్ దర్శనం కోసం కేటాయించాలని, ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి వీలైతే శివరాత్రి జాతరలోగానే ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించడం వల్ల సాధారణ భక్తులకు దర్శన ఇబ్బందులను దూరం చేయవచ్చని ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 6: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

సమ్మక్క భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం



ఆలయం వద్ద భక్తుల రద్దీ



కొండపైన భక్తుల వాహనాలు

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు ఆంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా తరలి వచ్చిన సమ్మక్క సారక్క భక్తులతో జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలి వస్తున్నారు. దాదాపుగా యాభై వేలకు వరకు భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకు వజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహ నాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

● సీపీ కఠిన చర్యలతో కబ్జాదారుల్లో భయం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: భూకబ్జా కేసులో మంగళవారం కరీంనగర్ పోలీసులు మాజీ ఆర్టీఏ మెంబర్ తోట శ్రీపతిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ శివారులోని వివేకానందపురి కాలనీకి చెందిన అనుమాండ్ల రవీందర్ 2014 మేలో తీగలగుట్టపల్లి రోడ్ నెంబరు 16 కార్తికేయనగర్‌లో 144 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి బేస్‌మెట్ నిర్మించుకుని 2023లో ఒక బోర్‌వెల్ కూడా వేసుకున్నాడు. ఇటీవలనే ఇంటి నిర్మాణం చేపడుతుండగా జనవరి 10న రాత్రి 10:30 గంటలకు పది మందికిపైగా అక్రమంగా చొరబడి 8 పిల్లర్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారని బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ జరిపి ఈ ఘటనతో ప్రమేయం ఉన్న కరీంనగర్ చైతన్యపురి కాలనీకి చెందిన తోట శ్రీపతిరావు(50), పొన్నాల కనకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు, మరి కొందరిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన విషయం తెలుసుకున్న శ్రీపతిరావు పరారీలో ఉండగా అతని గాలింపుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసి వెదుకుతుండగా సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ అబర్‌పేట్‌లో అతని సోదరుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌కు తీసుకువచ్చి విచారణ అనంతరం సాయంత్రం శ్రీపతిరావును కరీంనగర్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీపతిరావుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేయగా పోలీసులు జైలుకు తరలించారు.

● భూకబ్జాలు, దౌర్జన్యాలు, డబ్బులు డిమాండ్, వేధింపులకు సంబంధించి బాధితుల ఫిర్యాదులతో నిందితులపై వరుసగా కేసులు నమోదు చేస్తూ, అరెస్టు చేసి జైలుకు తరలిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజులుగా భూకబ్జాలు, మోసాలపై పోలీస్ కమిషనర్ దర్బార్‌ను నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు 660 మంది బాధితుల నుంచి సీపీకి ఫిర్యాదులు అందాయి.

కేసుల భయంతో 8 ప్లాట్లు అప్పగింత

ఇటీవల పోలీస్ కమిషనర్ భూకబ్జాలపై ఉక్కుపాదం మోపి కేసులు, అరెస్టులు చేస్తుండటంతో భయపడి కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని ఒక ప్రజాప్రతినిధి గతంలో కబ్జా చేసిన స్థలాలను బాధితులను పిలిపించుకుని తిరిగి వారికి అప్పగించనట్లు తెలిసింది. అప్పటి అధికారపార్టీకి చెందిన సదరు ప్రజాప్రతినిధి భూ వివాదంలో తలదూర్చి న్యాయం చేస్తానని చెప్పి చివరకు ఆ స్థలంలో ప్రహరీగోడను నిర్మించి తన ఆధీనంలో పెట్టుకున్నాడని, ఆ తరువాత ఇంటినెంబర్లు వేసి, షెడ్ కూడా నిర్మించినట్లు తెలిసింది. బాధితులు సీపీని ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకుని బాధితులను పిలిపించుకుని వారి స్థలాలను వారికే అప్పగించినట్లు సమాచారం. దీనిపై కూడా స్పెషల్‌టీం పోలీసులు ఆరాతీస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతుండటంతో ఆయా పరిధిలోని పోలీసు ఠాణాల ఎస్‌హెచ్‌ఓలకు అప్పగించి విచారణ జరపాలని సీపీ ఆదేశిస్తున్నారు. భూకబ్జాలు, డబ్బులు మోసాలకు సంబంధించి పెద్ద తలకాయల పాత్ర ఉన్న కేసులను నేరుగా సీపీ మానిటరింగ్ చేస్తూ దర్యాప్తు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ కేసుల దర్యాప్తును పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6: మండలంలోని అనంతగిరి గ్రామంలో కుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం మంగళవారం ఇంటి బయట ఆడుకుంటున్న పబ్బతి మనోజ్ఞ, పబ్బతి ప్రసన్న, జుట్టు బాలయ్యలను కుక్క కరిచింది. చికిత్స నిమిత్త వీరిని ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 6: భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం నేతన్న విగ్రహం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకొని రెండు రోజుల అవుతున్న వార్డెన్, అందులో పని చేస్తున్న ఉద్యోగులపైన ఇంతవరకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. విద్యార్థినులది హత్యనా, ఆత్మహత్యనా.? రెండు కోణాల్లో పోలీసులతో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, సందీప్, రుద్రవేణి ధనుష్, సంపత్, ఆకాస్, రాఘవేంద్ర, శివప్రసాద్, స్వామి, భార్గవ్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కుల గణనను పారదర్శకంగా చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6: బీసీ కుల గణనను ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి కంచర్ల రాజు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం సంతోషకరమని అన్నారు. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచాలని అన్నారు. ప్రగతిభవన్ పేరును మహాత్మ జ్యోతిబాపూలేగా నామకరణం చేసి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు తిరుపతి, శ్రీనివాస్, రాజునాయక్, రవి తదితరులు ఉన్నారు.

మాఘ అమావాస్య జాతరకు ఆలయాలు ముస్తాబు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు అక్కపల్లి, గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, తదితర గ్రామాల్లో ఈ నెల 9న జరిగే మాఘ అమావాస్య జాతర వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంగులు వేసి ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

బాల్క సుమన్‌ను విమర్శిస్తే సహించేదిలేదు

ముస్తాబాద్, ఫిబ్రవరి 6 : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై విమర్శలు చేస్తే ఊర్కునేదిలేదని మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య మండిపడ్డారు. సీఎంగా రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్, కేటీఆర్‌లను తిట్టడమే ధ్యేయంగా అధికారంలోకి వచ్చి అబద్ధపు , అసత్యపు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. తెలంగాణా అభివృద్ధి ఎవరు చేశారన్నది ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ప్రజలు బాధపడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లు తిడుతూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. అసలైన కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారని అధికార దాహంతో వెళ్లె వారిని ప్రజలు గమనిస్తున్నారని కొమ్ము బాలయ్య పేర్కొన్నారు.

వేములవాడలో సీఎం దిష్టిబొమ్మ దహనం

- బీఆర్ఎస్ నేతల బైండోవర్



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకులు

వేములవాడ, ఫిబ్రవరి 6: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం నాడు వేములవాడలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమం చేసి తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు తెలంగాణ పరిపాలించి రాష్ట్రాన్ని దేశంలోనే ముందు వరసలో నిలిపిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. కార్యక్రమంలో వెంగళ శ్రీకాంత్ గౌడ్, బత్తుల మహేందర్ యాదవ్, గుడిసె అరుణ్ కుమార్, తుమ్మల దిలీప్, కొమిరె వెంకటసాయి, పార్వతి మహేష్, షేక్ ఇబ్రహీం, మహమ్మద్ పర్వేజ్, లింగం రాకేశ్, షేక్ రఫీక్ ఉన్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ చౌక్ లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనలో బీఆర్ఎస్ నాయకులు వెంగళ శ్రీకాంత్‌గౌడ్, బత్తుల మహేందర్‌యాదవ్, గుడిసె అరుణ్ కుమార్, తుమ్మల దిలీప్, కొమిరె వెంకట సాయి, పార్వతి మహేష్, షేక్ ఇబ్రహీం, మహమ్మద్ పర్వేజ్, లింగం రాకేశ్, షేక్ రఫీక్ లను వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్, డిప్యూటీ తహసీల్దార్ రజిత ఎదుట బైండోవర్ చేశారు.

గోరుముద్ద కార్యక్రమానికి విరాళం అందజేత

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 6: నూకలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమానికి రేమాల ఫౌండేషన్ తరపున 15వేల రూపాయలను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్ మంగళవారం అధ్యాపకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వరాములు, హెచ్‌ఎం సదానందం, నాయకులు వకులాభరణం శ్రీనివాస్, ఈర్యా నాయక్, పర్శరాములు, కమలాకర్, అంజనీకుమార్, రేకబ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అభివృద్ధిపై విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలపై చర్చించి, పాఠశాలకు కావలసిన మౌళిక సదుపాయాలపై చర్చించారు. 10వ తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమం నిర్వాహణ కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు విరాళములు ప్రధానోపాధ్యాయులు శంకర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టె ప్రభాకర్, ఎడ్ల శ్రీనివాస్, పులి సత్యం, బత్తుల కమలాకర్, మర్రి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కోనరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చిలుక వరుణ్ (12) అనే విద్యార్థి సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నిమ్మపల్లి గ్రామానికి చెందిన చిలుక గంగాధర్, గంగవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు చిలుక వరుణ్ మర్తనపేటలోని ఓ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు, మూడు రోజుల క్రితం జ్వరంతోపాటు ఫిట్స్ వచ్చింది. అనంతరం బాగానే ఉండడంతో ఆసుపత్రిలో తల్లిదండ్రులు చూపించలేదు. సోమవారం విరోచనాలు, వాంతులు కావడంతో సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి సీరియస్‌గా ఉన్నాడని చెప్పి వైద్యం అందించారు. అయినప్పటికి ఫిట్స్ వచ్చి మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 6: కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామం ఎల్లమ్మ ఆలయ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మండలం చింతలఠాణ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై చింతలఠాణ నుంచి వేములవాడకు వస్తున్న క్రమంలో వేములవాడ నుంచి వస్తున్న కారు తిప్పాపూర్ ఎల్లమ్మ ఆలయం వైపు తిరుగుతుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో ప్రశాంత్‌కు తీవ్రగాయాలుకాగా ఆసుత్రికి తరలించినట్లు తెలిపారు.

సిలిండర్ పైపు లీకేజీ.. వ్యాపించిన మంటలు

కోనరావుపేట, ఫిబ్రవరి 6: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గంట సమ్మవ్వ ఇంటిలో మంగళవారం సిలిండర్ పైపు లీకేజీ అయ్యి మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో అప్రమత్తమైన పక్క ఇంటి వారు చేరుకొని గ్యాస్ సిలిండర్ ను బయటకు తెచ్చి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బండపల్లి క్రీడాకారుడు

చందుర్తి, జనవరి 6: మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన చింతలపల్లి మునీందర్‌రెడ్డి అనే క్రీడాకారుడు జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 8 నుండి 11 వరకు జరిగే జాతీయస్థాయి 10 కిలోమీటర్ల మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మునిందర్‌ను మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, కోనరావుపేట, రుద్రంగి తదితర మండలాల్లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిరిసిల్ల పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఇల్లంతకుంటలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సిరిసిల్లలో..

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను, కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటాలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీతి నిజాయితీ ఉన్న వ్యక్తి అబద్ధాలు ఆడరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా ఒకరిని దూషించలేదని రండ వ్యవహారం అంటూ సంబోధించారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తొమ్మిదన్నర సంవత్సరాల్లో అప్పటి ప్రతిపక్షపార్టీల నాయకులను 150 సార్లు రండా అని పలు సందర్భాల్లో వ్యాఖ్యానించాడని ఆరోపించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, ప్రధాన కార్యదర్శి అరుణ, మాజీమున్సిపల్ చైర్ పర్సన్ సామల పావని తదితరులు పాల్గొన్నారు.

● బాల్క సుమన్‌పై పోలీసులకు ఫిర్యాదు..

సీఎం రేవంత్‌రెడ్డిని అసభ్య పదజాలాలతో దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం సిరిసిల్ల పట్టణం పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా, పట్టణ నాయకులు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఎస్సీ సెల్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నక్క నర్సయ్య, నాయకులు శివరాజ్, హనుమంతు, లక్ష్మన్, కిరణ్, తాటిపాముల శ్రీనివాస్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, తిరుపతి, రాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రామచంద్రం, రఫీక్, తిరుపతిగౌడ్, బాబు, రవి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఊరేగించి అనంతరం దహనం చేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు బాలపోచయ్య, ఆనందరెడ్డి, ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, సంతోష్‌కుమార్, జమాల్, నరేష్, మల్లేశం, రమేష్, లింగం, సత్యారెడ్డి, సుజాత, నరేందర్‌రెడ్డి, బాబు, నర్సింగం, శంకర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా వారికి బుద్ధి రాలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మరోసారి సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలపై అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నేరెళ్ల నర్సింగం, గుగ్గిళ్ళ శ్రీకాంత్, మునిగెల రాజు, బైరినేని రాము, భరత్ గౌడ్, పొన్నం పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: సీఎం రేవంత్ రెడ్డిపై మాజి ఎమ్మేల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాగాంధి చౌరస్తాలో మాజి ఎమ్మేల్యే బాల్క సుమన్ దిష్టిబోమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చెలుకల తిరుపతి, గండి నారాయణ, పల్లి గంగాదర్, మాడిశెట్టి అబిలాష్, ఇప్ప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● నోరు అదుపులో పెట్టుకోవాలి..

కోనరావుపేట: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ రెడ్డి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఇన్ని రోజులు దొరలకు ఊడిగం చేసి ఈ ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెప్పుతోని కొట్టుతానని అనడం హేయమైన చర్య అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం సుమన్‌పై చర్యలు తీసుకోకపోతే రెడ్డి సామాజిక వర్గం గుణపాఠం చెప్తామని అన్నారు.



సిరిసిల్లలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● ప్రజలు తరిమికొట్టే రోజు వస్తుంది..

వేములవాడ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిని నోటికి వచ్చినట్టు మాట్లాడితే బాల్క సుమన్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు వస్తాయని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలను మోసం చేసింది బీఆర్ఎస్ పార్టీ అని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేసింది కేసీఆర్ ప్రభుత్వమని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబానికి విద్యార్థి ఉద్యమంను తాకట్టు పెట్టిన ఘనత బాల్క సుమన్‌కు దక్కుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు.

పేరుకుపోయిన చెత్త.. మురుగునీరు..



నిల్వ చేరిన మురుగు, చెత్తాచెదారం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 6: పాలకవర్గాల పదవులు ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడంతో మురుగు నీరు చేరి ఇళ్ల నడుమ తటాకంను తలపిస్తోంది. దుర్గంధం వెదజల్లుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలోని యూనియన్ బ్యాంక్ వెనకాల కాలనీలో మురుగు నీటి కాల్వలు లేకపోవడంతో నీరు ఖాళీ స్థలంలోకి చేరి కంపు కొడుతోంది. చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈగలు, దోమలు వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ నేతలకు జైలు భయం మొదలైందని, అందుకే ఏది పడితే అది మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం హెచ్చరించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం కటకం మృత్యుంజయం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా మృత్యుంజయం మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగా రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన భారీ అవినీతి కుంభ కోణాల వల్ల బీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని బీఆర్ఎస్ నేతలు అంటేనే సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా జవాబు ఇచ్చారే తప్ప ఎవరిని కించపర్చ లేదన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే సంస్కృతి బీఆర్ఎస్‌కే చెల్లిందన్నారు. సెస్‌లో భారీ అవినీతి జరిగిందని, జరిగిన అవినీతిపై అప్పట్లో ఆగిన విచారణ కచ్చితంగా జరిపిస్తామన్నారు. కచ్చితంగా 9వ ప్యాకేజీ పనులను పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణ సంస్కృతిని నాశనం చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కటకం మృత్యుంజయం

● డబుల్ ఇళ్ల పంపిణి అవకతవకలపై రీసర్వే..

గంభీరావుపేట మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణిలో జరిగిన అవకతవకలపై రీసర్వే చేయిస్తామని కటకం మృత్యుంజయం వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు తమకు రాలేదని చాల మంది అర్హులు వాపోతున్నారన్నారు. అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో ప్రయాణికుడి వీరంగం

- సీట్ ఇవ్వాలని డ్రైవర్‌తో వాగ్వాదం - ఎంత చెప్పినా వినకపోవడంతో బస్సుదిగి వెళ్లిన డ్రైవర్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 6: టికెట్ తీసుకున్న తనకు బస్సులో సీటు కూడా చూపించాలని మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తిప్పాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి రాజన్న దర్శనానికి తన కుటుంబ సభ్యులతో వచ్చి తిరిగి వెళ్లేందుకు బస్టాండుకు వచ్చాడు. వేములవాడ డిపోకు చెందిన డిలక్స్ బస్సు పూర్తిగా నిండంతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. సదరు మద్యం సేవించిన వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి బస్సు ఎక్కాడు. డ్రైవర్ సదరు వ్యక్తి వద్ద టికెట్ తీసుకున్నాడు. అయితే టికెట్ తీసుకున్న తనకు సీటు చూపించాలని, బస్సులో ఎక్కడ కూడా సీట్లు ఖాళీగా లేవని, డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. చాలా సమయం వరకు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగుతూ తనకు సీటు కెటాయిస్తేనే బస్సు ముందుకు కదులాలని భీష్మించుకు కూర్చున్నాడు. చేసేదేమిలేక విసుగు చెందిన డ్రైవర్ బస్సును వదిలేసి దిగి సంబంధిత అధికారులకు సమాచారం అందించాడు.

● ప్రయాణికులపై దాడి..

మద్యం మత్తులో వున్న వ్యక్తికి డ్రైవర్ ఎంత చెప్పినా వినకపోవడంతో డ్రైవర్ బస్సు దిగి వెళ్లాడు. చాలాసేపటి వరకు బస్సు నిలిచిపోవడంతో విసుగుచెందిన ప్రయాణికులు సదరు వ్యక్తికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంత చెప్పినా వినకపోవడంతో ప్రయాణికులు మందలించారు. ఆగ్రహానికి లోనైన వ్యక్తి అడ్డం వచ్చిన వారిని కొట్టడం మొదలుపెట్టాడు. ఆడవాళ్లని కూడా చూడకుండా చేయి వేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో సదరు వ్యక్తితో పాటు పలువురికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఎంత ఆపేందుకు ప్రయత్నం చేసినా వినకపోవడంతో డ్రైవర్ 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రీట్‌మెంట్ కోసం ఆసుపత్రికి, పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు సైతం సహకరించకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సులో ప్రయాణికులను పంపించారు.

సంక్షిప్త సమాచారం..

ఇల్లంతకుంట: మండలంలోని దాబాల్లో మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై దాస సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని దాబాల్లో పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఏఎస్సై మోతీరాం, హెచ్‌సీలు లక్ష్మణ్, దేవేందర్‌రెడ్డి, మధు, చంద్రశేఖర్ ఉన్నారు.

కోనరావుపేట: మరిమడ్ల పాఠశాలకు నూనె నగేష్ యాదవ్ అనే వ్యక్తి హైమాస్ట్ లైట్స్, నాలుగు కంప్యూటర్లు, పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశాడు. నూనె నగేష్‌ను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు పద్మజ, పద్మ, రవి, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

- కోనరావుపేట మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు భూమేష్, స్వప్న, లత బదిలీపై వెళ్లగా వారిని ఘనంగా సన్మానించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోనె ఎల్లవ్వ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. లక్ష్మారెడ్డి, సతీష్, రవి, మధు, రాంరెడ్డి, శ్రీనివాస్, రాజుకుమార్, రఫీక్ తదితరులు ఉన్నారు.

మల్యాల: కొండగట్టు అంజన్న దేవస్థానానికి మంగళవారం రూ.19.53లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ, పులిహోర, శీఘ్ర, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కాసులు కురిపిస్తున్న కూరగాయల సాగు



సోరకాయ పంట

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 6: మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల ప్రాంతంలో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగుపై దృష్టి సారిస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దబోనాల, చిన్నబోనాల, రగుడు, ముష్టిపెల్లి, చంద్రంపేట, పెద్దూర్ తదితర గ్రామాల్లో రైతులు నీటితో సాగయ్యే కూరగాయల పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం రైతులు ఎక్కువగా ఆకుకూరలు, బీర, గోరుచిక్కుడు, కాకర, టమాట, బెండ, వంకాయ, పచ్చకూర, పాలకూర, కొతిమీర, మెంతికూర, సోరకాయలు, కాలిఫ్లవర్, క్యారెట్, క్యాప్సికమ్‌లను పండిస్తున్నారు. రైతులు ప్రతిరోజూ కూరగాయలను ఉదయం సాయంత్రం తెంపి సిరిసిల్ల మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ రైతులను ఆదర్శంగా తీసుకున్న మరికొందరు కూడా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు.

కూరగాయల సాగుతోనే పూట గడుస్తుంది



- గుగ్గిళ్ల పర్శరాములు యాదవ్, రైతు, రగుడు

వ్యవసాయ బావులు, బోర్లలో ఉన్న కొద్దినీటితోనే రెండెకరాల్లో అన్ని రకాల కూరగాయలు సాగుచేసి ప్రతిరోజు సిరిసిల్లలో విక్రయిస్తేనే పూట గడుస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలనే సాగుచేస్తున్నాం.

రేపు బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 6: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అండర్-16 బాలబాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉంటాయని మంగళవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట రామ్‌కుమార్, చైర్మన్ జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి సంగారపు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొనే బాలబాలికలు అర్హతలు 55 కిలోల బరువు లోపు ఉండాలని తేది : 2008 మార్చి 20లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 8న సిరిసిల్ల పట్టణంలో జరిగే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఉదయం 9 గంటలలోపు జనన ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో హాజరుకావలని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

రేపు ముస్తాబాద్‌లో ఠాణా దివస్

ముస్తాబాద్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని పోలీసు ఠాణాలో ఈనెల 7వ తేదీన ఠాణా దివస్ కార్యాక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు పోలీసు ఠాణాలో నిర్వహించే ఠాణా దివస్ కార్యక్రమం ఎస్పీ అఖిల్ మహాజన్ సారథ్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఉండే సమస్యలు, ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకు రావాల్సిందిగా కోరుతున్నట్లు ఎస్సై తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై కోరారు.

నేడు సెస్ విద్యుత్ వినియోగదారుల సదస్సు

ముస్తాబాద్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని సెస్ సేవాసదన్‌లో విద్యుత్ వినియోదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిజామాబాద్ చైర్‌పర్సన్ ఎఫ్‌ఏసీ అండ్ మెంబర్ టెక్నికల్ ఎస్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు ముస్తాబాద్ సేవాసదన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గంభీరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాలకు చెందిన సిరిసిల్ల విద్యుత్ సహకార సంస్థ వినియోదారులు సదస్సులో పాల్గొని తమ సమస్యలను పరిష్కారించుకోవాలని కోరారు.

మైసమ్మ గుడికమిటీ చైర్మన్‌గా ప్రతాప్‌రెడ్డి

ముస్తాబాద్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని పులిశేరుకుంట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బద్దిపడిగె ప్రతాప్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పిట్ల విఠల్, కోశాధికారిగా బండారి సత్తయ్య, రైటర్‌గా కె బాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పుల్లూరి రవి, కార్యవర్గ సభ్యులుగా శీల ప్రశాంత్, అబ్రమేని సాయిలు, ఎస్ దేవయ్య, బి నందు, గడ్డి భిక్షపతి, కంతుల భాస్కర్, టీ శ్రీనివాస్‌రెడ్డి కె కిష్టారెడ్డి, టి రాజు, ఏ రాజు, ఎస్ రాజులు ఏకగ్రీవంగా నియామకమయ్యారు.

పెద్దూర్ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నియామకం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 6: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పెద్దూర్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని నియామకం చేసిన వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా జాన వేణు, జంగిటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా నల్లూరి సంతోష్‌గౌడ్, కార్యదర్శిగా సలేంద్రి మధుయాదవ్, కోశాధికారిగా గోర్రె మల్లేష్‌తోపాటు యూత్ కమిటీ అధ్యక్షుడిగా ర్యాకం అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సలేంద్రి రజనీకాంత్, పులి నితిన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జాన ప్రభుదాస్, కార్యదర్శిగా ర్యాకం సుమన్, కోశాధికారిగా గోట్టే ఉదయ్‌లను నియమించినట్లు మంగ ప్రశాంత్ తెలిపారు.